క్లుప్తంగా

పారదర్శకంగానే బదిలీలు

తిరుపతి అర్బన్ : చంద్రగిరి నియోజకవర్గంలో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు పారదర్శకంగానే చేపట్టినట్టు డీపీఓ సుశీలాదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన 'సాక్షి'లో 'బదిలీలు.. బేరసారాలు' శీర్షికతో ప్రచురితమైన కథనంపై స్పందించారు. తిరుపతి రూరల్ మండలంలో పంచాయతీ కార్యదర్శులు మురళి, విజయ నిర్మల, మధుసూదన్, నేతాజీ, ఝాన్సీ, సుచిత్ర, లావణ్య తదితరులు బదిలీలు సాధారణంగానే జరిగినట్టు వెల్లడించారు. వారి కుటుంబ అవసరాలతోపాటు ఆరోగ్య రీత్యా తిరుపతి రూరల్ మండలంలో పనిచేయడానికి అవకాశం కల్పించాలని స్థానిక శాసనసభ్యుడిని కోరినట్లు వివరించారు. అంతే తప్ప ఎవరికీ పైకం ఇవ్వలేదని స్పష్టంచేశారు.

వరద బాధితులకు విరాళం


కలెక్టర్‌కు చెక్ అందిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీహరి

తిరుపతి అర్బన్ : విజయవాడ వరద బాధితుల సహాయార్థం డీఎంహెచ్‌ఓ శ్రీహరి రూ.25 వేల విరాళం అందించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చెక్కు అందజేశారు.

పాకాల జూనియర్ జడ్జిగా పూర్ణిమాదేవి

తిరుపతి లీగల్ : పాకాల జూనియర్ సివిల్ జడ్జిగా పి.పూర్ణిమాదేవిని నియమిస్తూ హైకోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పూర్ణిమాదేవి ప్రస్తుతం ప్రకాశం జిల్లా కందుకూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్నారు. అలాగే హైకోర్టు ఆధ్వర్యంలో జ్యుడీషియల్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఈ మేరకు చిత్తూరు నాలుగో అదనపు జూనియర్ జడ్జి నుంచి బాధ్యతలు స్వీకరించాలని హైకోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఒత్తిడిని జయించడంపై దృష్టి

తిరుపతి తుడా : మానసిక ఒత్తిడిని జయించడంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖరన్ సూచించారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా ఎస్వీ మెడికల్ కళాశాల భవనగిరి ఆడిటోరియంలో వైద్య విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు, ఉద్యోగుల మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. అధిక ఒత్తిడి కారణంగానే అనేకమంది క్షణికావేశంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని వెల్లడించారు.

బీసీ ప్రొఫెసర్ల ప్రాధాన్యతకు వినతి

తిరుపతి కల్చరల్ : స్విమ్స్ పరిపాలన చదువులలో బీసీ ప్రొఫెసర్లకు ప్రాధాన్యత కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.నారాయణ గౌడ్ కోరారు. మంగళవారం ఈమేరకు స్విమ్స్ వీసీ డాక్టర్ ఆర్‌వీ కుమార్‌కు వినతి పత్రం సమర్పించారు.

నేడు మండల మీట్

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండల సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ యుగంధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

క్షణికావేశంతోనే ఆత్మహత్యలు

రామచంద్రాపురం: కష్టాలు ప్రతిఒక్కరికీ వస్తుంటాయని వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని, క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడకూడదని ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నిరంజన్‌బాబు, ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్ పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

తిరుపతి సిటీ: ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం పద్మావతి మహిళా వర్సిటీలో సైకాలజీ విభాగం వారు విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సుమారు 50మంది విద్యార్థినులు పాల్గొన్న ఈ పోటీలకు అధ్యాపకులు డాక్టర్ బిందు, డాక్టర్ మల్లీశ్వరమ్మ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

మూడు రోజులకే బదిలీ!

తిరుపతి క్రైమ్ : రాజకీయ నేతల ఒత్తిడికి పోలీసులు చిత్తవుతున్నారు. అధికార పార్టీ నాయకులకు నచ్చకుంటే వెంటనే బదిలీ అవుతున్నారు. ఈనెల 5వ తేదీన తిరుమల టూ టౌన్ సీఐగా మురళీమోహన్ బదిలీపై వచ్చారు. గురువారం బాధ్యతలు తీసుకున్న ఆయనను మంగళవారం తిరుపతి వీఆర్‌కు బదిలీ చేసేశారు. అలాగే ఆగస్టు 21వ తేదీన తిరుపతి రూరల్ సీఐగా సాధిక్ ఆలీ నియమితులయ్యారు. స్థానిక టీడీపీ నేతల అత్యుత్సాహం తట్టుకోలేక 27వ తేదీన మెడికల్ లీవ్ పెట్టి వెళ్లిపోయారు.

ఇక పదండి పదండి వెళ్లి పనిలో దిగుదాం..



ఏం పని.. ఎంత కూలి ఇస్తారు.. మేస్త్రీలతో మాట్లాడుకుంటున్న కూలీలు



వలస కథా చిత్రమ్!

- నిత్యం పనుల వేటలో పరుగులు
- తిరుపతిలో బతుకు పోరు సాగిస్తున్న శ్రీకాకుళం వాసులు

ఎక్కడో శ్రీకాకుళంలో పుట్టారు.. బతుకుదెరువు కోసం వలస కూలీలుగా తిరుపతికి చేరారు. నిత్యం వేకువనే నడుముకు పైగుడ్డ కట్టుకుని.. భోజనం క్యారేజీ చేతపట్టుకుని ఇంటి నుంచి బయటపడతారు. వందల సంఖ్యలో నగరంలోని ప్రధాన కూడళ్లకు చేరిపోతారు. ఎవరు పని చూపుతారా అని ఆశగా ఎదురుచూస్తుంటారు. ఎక్కడ పనిదొరికినా తమవారితో కలిసి గుంపులుగా బయలుదేరుతారు. ఆటోలు.. మినీ లారీల్లో పని ప్రాంతానికి చేరుకుంటారు. ఒళ్లు దాచుకోకుండా కష్టపడతారు. కుటుంబ పోషణ కోసం కఠోరంగా శ్రమిస్తారు. స్థానిక జీవకోనలోనే ఏళ్ల తరబడి నివసిస్తూ జీవన పోరాటం సాగిస్తున్నారు. జిల్లాలను దాటి వచ్చి శ్రీవారి పాదాల చెంత వేల సంఖ్యలో వలస కూలీలు బతుకుతున్నారు. ఉదయాన్నే నగరంలోని ఏ కూడలిని చూసినా గుంపులు గుంపులుగా వీరే కనిపిస్తుంటారు. బహుళ అంతస్తుల భవనాల నిర్మాణంలో శ్రీకాకుళం కూలీలే కీలకపాత్ర పోషిస్తుంటారు. ఎంతటి క్లిష్టమైన పని అయినా ఇష్టంతో పూర్తి చేసి అందరి మెప్పు పొందుతుంటారు.

– తిరుపతి మంగళం


పని ప్రాంతానికి ఆటోలో తరలి వెళుతూ..


పని వెతుక్కునేందుకు క్యారేజీలు కట్టుకుని..


మినీ లారీలో ఎక్కుతున్న కూలీలు

కించపరచడంపై ఫిర్యాదు


రుయా సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏఎన్‌ఎంలు

తిరుపతి తుడా : అర్హతల ఆధారంగా ఏఎన్‌ఎంలకు స్టాఫ్ నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే, కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు హేళన చేస్తున్నారని ఏఎన్‌ఎంలు మండిపడ్డారు. మంగళవారం ఈ మేరకు వారు మాట్లాడుతూ తమను కించపరిచిన వారిపై చర్యలు తీసుకోవాలని రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రవి ప్రభుకు విన్నవించారు. ముఖ్యంగా కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ చంద్రకళ అభ్యంతరకర వ్యాఖ్యలతో వైద్య ఆరోగ్యశాఖ పరువు పోయిందని ఆరోపించారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులు తమకు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఏఎన్‌ఎంల విద్యార్హత, నర్సింగ్ ట్రైనింగ్, వారికి కల్పించిన ఉద్యోగోన్నతిపై హేళనగా మాట్లాడిన కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు చంద్రకళకు రుయా సూపరింటెండెంట్ నోటీసులు జారీ చేశారు. 48 గంటల్లోపు వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

'సాధు' జీవితం.. స్ఫూర్తిదాయకం


మాట్లాడుతున్న విభీషణ శర్మ

తిరుపతి కల్చరల్ : తిరుమల శ్రీవారికి సేవలందించిన సాధు సుబ్రమణ్య శాస్త్రి జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ తెలిపారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు ఆకెళ్ల విభీషణ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం అన్నమాచార్య కళామందిరంలో సాధు సుబ్రమణ్య శాస్త్రి 43వ వర్ధంతి సందర్భంగా సాహితీ సదస్సు నిర్వహించారు. ఆచార్య ఉమ మాట్లాడుతూ శ్రీవారి ఆలయ చరిత్రను సుబ్రమణ్యశాస్త్రి వెలికి తీశారన్నారు. రాణి సామవైభోగ శ్రీనివాసమూర్తి విగ్రహాన్ని ఆలయానికి అందించారన్నారు. సుబ్రమణ్యశాస్త్రి వెలికి తీసిన తొలి శాసనమే శ్రీవారి ఆలయ చరిత్ర బయటకు రావడానికి కారణమని వెల్లడించారు. జాతీయ సంస్కృత వర్సిటీ ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ ఉపన్యసిస్తూ తాళ్లపాక వారి 41వ శాసనాలలో దేవాలయాల వ్యవస్థ, దాతలు ఇచ్చిన దానాలు, వాటి వినియోగ పద్ధతి, నాటి పాలన, అర్చకులు, పరిపాలన అధికారులు, సేవకులు వంటి అంశాలను వివరించారు. శాసన పరిశోధకుడు తొండవాడకు చెందిన సొరకాయల కృష్ణారెడ్డి మాట్లాడుతూ తిరుమల శ్రీవారి ఆలయంలోని శాసనాలను అనువదించి ఆలయ చరిత్రను, శ్రీవేంకటేశ్వరస్వామి వారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు సాధు సుబ్రమణ్యశాస్త్రి అని కొనియాడారు. అనంతరం శ్వేత భవనం ఎదుట సాధు సుబ్రమణ్యశాస్త్రి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో శాస్త్రి కూతురు గిరిజ, మనవడు సీబీఐ జడ్జి సీఎస్.మూర్తి, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్, తాళ్లపాక వంశీయుడు హరినారాయణ ఆచార్యులు, డీఈఓ నాగరాజు నాయుడు, ప్రచురణల విభాగం ఉప సంచాలకుడు నరసింహాచార్య, డీపీపీ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ కోకిల పాల్గొన్నారు.

అయోమయంలో తాత్కాలిక ఉద్యోగులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ తాత్కాలిక ఉద్యోగుల పరిస్థితి అయోమయంలో పడింది. ఏ నిమిషానికి ఏ వార్త వినాల్సి వస్తుందోనని మధనపడుతున్నారు. అకడమిక్ కన్సల్టెంట్ల పరిస్థితి దారుణంగా తయారైంది. సర్వీసును ఏడాది పాటు పొడిగించేలా స్పష్టమైన ఆదేశాలు ఉన్నా వర్సిటీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. అలాగే అకడమిక్ కన్సల్టెంట్లను 100కు తగ్గించేందుకు పావులు కదుపుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో 90 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 70మంది కాంట్రాక్టు ఉద్యోగులు, 30 మంది గెస్ట్ లెక్చరర్లకు నష్టం వాటిల్లనుంది. సర్వీసును పొడిగించకుండా అధికారులను కొంతమంది బయటి వ్యక్తులు తప్పదోవ పట్టిస్తున్నారని తాత్కాలిక ఉద్యోగులు వాపోతున్నారు. ఉద్యోగం ఉంటుందో ఊడుతుందో తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్నామని, తమ సర్వీసును 89 రోజులకు ఒకసారి పొడిగించాల్సి ఉన్నా, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏకకాలంలో 120మంది నాన్‌టీచింగ్ స్టాఫ్‌పై బదిలీ వేసిన అధికారులు, మూడు రోజుల క్రితం మరో 23 మందికి స్థాన చలనం కల్పించారు. మరో 60మందిపై బదిలీ వేటు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

క్యాన్సర్‌పై అప్రమత్తం


పరీక్షలు చేస్తున్న వైద్యులు

తిరుపతి రూరల్ : క్యాన్సర్‌పై అవగాహన, అప్రమత్తత అవసరమని సీ.మల్లవరం సర్పంచ్ మొక్కల భారతి సూచించారు. తిరుపతి రాష్ట్రీయ సేవా సమితి (రాస్) ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సహకారంతో తిరుపతి రూరల్ మండలం సీ.మల్లవరం సచివాలయం ప్రాంగణంలో మంగళవారం క్యాన్సర్ పై అవగాహన, స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. 163 మంది మహిళలకు ఉచితంగా పరీక్షలు చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ బరువు తగ్గడం, జ్వరం, దగ్గు వస్తుండడం, నిరంతరం తలనొప్పి, మూత్రనాళంలో రక్తం రావడం, నీరసంగా ఉండడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు. రాస్ సంస్థ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ షహనాజ్, రాస్ సిబ్బంది నాగరాజునాయుడు, నాగేశ్వరరావు, నాగరాజు, నీలమ్మ, సులోచనమ్మ, షాహిన్ పాల్గొన్నారు.

శక్తిపీఠంలో వారాహి గణపతి


విశేషాలంకరణలో విఘ్నేశ్వరుడు

రామచంద్రాపురం: మండలంలోని శ్రీశక్తిపీఠంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం శ్రీవారాహి గణపతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీశక్తి పీఠం వ్యవస్థాపకుడు సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతి సుప్రభాత సేవతో గణపతి స్వామివారిని మేల్కొలిపి నిత్య పూజలు ప్రారంభించారు. వేదపండితులు హోమం జరిపించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

'గౌరిపెద్ది' కృషిని మరువలేం


సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

తిరుపతి కల్చరల్ : అన్నమయ్య సంకీర్తనలను పరిష్కరించడంలో గౌరిపెద్ది రామసుబ్బశర్మ కృషి మరువలేనిదని స్విమ్స్ వీసీ డాక్టర్ ఆర్‌వీ కుమార్ తెలిపారు. మంగళవారం సాయంత్రం అన్నమాచార్య కళామందిరంలో గౌరిపెద్ది రామసుబ్బశర్మ 102వ జయంతి సందర్భంగా సాహితీ సదస్సు నిర్వహించారు. ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ అద్భుతమైన సాహితీ సృజన చేసిన ప్రముఖుల్లో గౌరిపెద్ది ఒకరని కొనియాడారు. అన్నమాచార్యుల సంకీర్తనలు 27 సంపుటాలను పరిష్కరించారని వెల్లడించారు. అనంతరం ఓరియంటల్ కళాశాలలోని గౌరిపెద్ది రామసుబ్బ శర్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు డాక్టర్ సర్వోత్తమ రావు అవధాన సరస్వతి డాక్టర్ గండ్లూరి దత్తాత్రేయ శర్మ, అభినయ కూచిపూడి కళాక్షేత్రం వ్యవస్థాపకులు పవని శ్రీలత, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు విభీషణ శర్మ, గౌరిపెద్ది శంకర భగవాన్, ఉప సంచాలకుడు డాక్టర్ నరసింహాచార్య, ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోకిల, టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

చిరువ్యాపారుల నిరసన


నిరసన తెలుపుతున్న చిరు వ్యాపారులు

తిరుపతి(అలిపిరి): తమకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట శ్రీవారి మెట్టు చిరువ్యాపారులు వినూత్నంగా నిరసన తెలిపారు. శ్రీవారి చిత్రపటం పట్టుకుని, గోవిందనామాలతో ఆందోళన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ 22 రోజుల నుంచి నిరసన దీక్ష కొనసాగుతున్నా టీటీడీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, యుగంధర్, చిట్టిబాబు, మధు, రామ్మూర్తి, ప్రకాష్, చిరంజీవి, మల్లికార్జున, పెంచలయ్య, సోను, గణేష్ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు


రాస్తారోకో నిర్వహిస్తున్న వివిధ సంఘాల నేతలు

తిరుపతి కల్చరల్ : విశాఖ ఉక్కు..ఆంధ్రుల హక్కు అని, ఎన్నో త్యాగాలతో సాధించుకున్న పరిశ్రమను మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసేందుకు చర్యలు చేపట్టడం దారుణమని సీఐటీయూ, ఏఐటీయూసీ, రైతు సంఘాల నేతలు మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి వ్యతిరేకంగా మంగళవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు, హేమలత మాట్లాడారు. మోదీ పథకం ప్రకారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను నష్టాలు పాలు చేస్తున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సైతం విశాఖ ఉక్కు పరిరక్షణ ఊసే ఎత్తకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతలు విశ్వనాథ్, కేవై.రాజా, సీహెచ్ శివకుమార్, శ్రీరాములు, నాగరాజు, సురేష్, సుబ్రమణ్యం, జయచంద్ర, మాధవ్, లక్ష్మి, మల్లికార్జునరావు, గురవయ్య, ఎన్‌డీ రవి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విలయం

- సహాయ చర్యల్లోనూ సర్కారు విఫలం
- వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : ప్రభుత్వ నిర్లక్ష్యమే విజయవాడలో వరద విలయానికి, లక్షలాది మంది కష్టాలకు కారణమని వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం తుమ్మలగుంటలో ఆయన మాట్లాడారు. విజయవాడలో వచ్చింది మ్యాన్ మేడ్ ఫ్లడ్ అని స్పష్టం చేశారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో వాతావరణ శాఖ, నీటి పారుదల విభాగం ముందస్తు హెచ్చరికల మేరకు ప్రభుత్వం వెంటనే ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని రక్షిత ప్రాంతాలకు తరలించి పునరావసం కల్పించాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ముందస్తు సమాచారం ఉన్నా కూడా వరదల నుంచి ప్రజలను రక్షించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. నిర్వాసితులను ఆదుకోవడంలో కూడా నిర్లక్ష్యం కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు కావాల్సిన వారి కోసం లక్షలాది మంది పేదలను కష్టాలు పాలు చేసి బుడమేరు నుంచి నీటిని వెలగలేరు రెగ్యులేటరీ ద్వారా విజయవాడ మీదకు వదిలేశారని ఆరోపించారు. ప్రభుత్వం చేతకానితనం వల్ల లక్షలాది మంది 8 రోజులుగా వరద ముంపులో అల్లాడుతున్నారని మోహిత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకర పరిస్థితుల మధ్య ప్రజలు తమకు తాముగానే సురక్షిత ప్రాంతాలకు చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. ఈ క్రమంలోనే దాదాపు 50 మందికి పైగా ప్రాణాలను కోల్పోవాల్సి వచ్చిందని వివరించారు. రాష్ట్ర రాజధానిగా చెప్పుకుంటున్న విజయవాడలోనే లక్షలాది మంది ఇలాంటి దుస్థితిలో ఉంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. ప్రచారం కోసం మాత్రమే అధికారులను వెంట వేసుకుని ముఖ్యమంత్రి, మంత్రులు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రోజుకు రెండు, మూడుసార్లు ప్రెస్ మీట్‌లు పెట్టి అంతా తామే చేస్తున్నట్లు భ్రమ కల్పించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.

టీడీపీ ఫ్లెక్సీపై దళితుల ఆందోళన


అంబేడ్కర్ విగ్రహానికి అడ్డుగా టీడీపీ నేతల ఫ్లెక్సీ

పాకాల : మండలంలోని మొగరాలలో రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి అడ్డుగా టీడీపీ నేతలు ఫ్లెక్సీ పెట్టడంపై దళితులు ఆందోళనకు దిగారు. మంగళవారం దళిత నాయకులు మాట్లాడుతూ విగ్రహానికి అడ్డుగా ఉన్న ఫ్లెక్సీని తొలగించాలని కోరితే టీడీపీ నేతలు దురుసుగా ప్రవర్తించారని మండిపడ్డారు. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ కులం పేరుతో దూషించారని ఆరోపించారు. టీడీపీ నేతల వైఖరికి నిరసనగా మొగరాల సెంటర్‌లో డప్పులు కొట్టారు. అనంతరం టీడీపీ ఫ్లెక్సీని తొలగించి అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పట్నం చిట్టిబాబు, మధు, దేవ, ప్రసాద్, వేణు, హరీష్‌కుమార్, అమర్, చరణ్, తదితరులు పాల్గొన్నారు.